సాక్షి తిరుపతి

సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	33	18
తిరుమల	29	14
గూడూరు	33	20
నగరి	34	18



నేడు జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన ఉంటుందని డీఈఓ శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాట్లపై సమీక్షించారు.

న్యూస్‌రీల్

నృసింహునికి విరి సేవ



రాపూరు: జిల్లాలోని ప్రముఖపుణ్య క్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పుష్ప యాగం కనులపండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ మండపంలో శేష వాహనంపై శ్రీలక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లను కొలువుదీర్చి పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ 1500 వందల కేజీల వివిధ రకాల పరిమళభరిత పుష్పాలతో అర్చించారు. అశేష సంఖ్యలో విచ్చేసిన భక్తజనం వీక్షించి తన్మయత్వం చెందారు. ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి,పెంచలయ్యస్వామి మాట్లాడుతూ ఆలయ సేవల్లో జరిగే దోష ప్రాయశ్చిత్తం లోక శాంతి కోసం పుష్ప యాగం చేయడం ఆనవాయితీ అని తెలిపారు. అంతకు ముందు ఉదయం 9గంటలకు దేవదేవేరులకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జిల్లా కే.వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

మాఘమాసం వచ్చె.. పెళ్లికళ తెచ్చె!

పెళ్లి.. ఇరువురి జీవితాలను ముడివేస్తుంది.. వేదమంత్రాల సాక్షిగా వధూవరుల మనసులో ప్రేమానురాగాలకు బీజం వేస్తుంది.. ఒకరికొకరు తోడుగా సాగించే జీవన పయనానికి బాటలు వేస్తుంది.. రెండు కుటుంబాల నడుమ బంధాలను పెనవేస్తుంది.. అపురూపమైన బాంధవ్యాలను దగ్గర చేస్తుంది.. అందుకే భారతీయ సంస్కృతిలో వివాహ వేడుకకు అత్యున్నత స్థానం ఉంది. సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ కల్యాణం జరిపించేందుకు సుముహూర్తానికి ప్రాధాన్యత ఉంది. అందులో మాఘ మాసం పెళ్లిలగ్నాలు మరింత శుభకరం.. విశిష్ట రోజులు మొదలవడంతో జిల్లాలో మంగళవాయిద్యాలు మోగుతున్నాయి.. అలాగే గృహ నిర్మాణాలకు శంకుస్థాపనలు.. ఇతర శుభకార్యాలు జోరుగా సాగుతున్నాయి.





ముస్తాబైన పెళ్లి వేదికలు

- జిల్లాలో శుభకార్యాల సందడి
- వరుసగా సుముహూర్తాలు
- పెద్దసంఖ్యలో వివాహ వేడుకలు



చిత్తూరు రూరల్ : మాఘమాసం జనవరి 22వ తేదీ నుంచి ప్రారంభమైంది. దీంతో జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి మొదలైంది. ఈ నెల 20వ తేదీ వరకు మంచి ముహూర్తాలు ఉండడంతో వివాహ సన్నాహాల్లో పెద్దలు నిమగ్నమయ్యారు. పెళ్లిళ్లతోపాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, నిశ్చితార్థాల తదితర శుభకార్యాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే రానున్న ఫాల్గుణ మాసంలోనూ శుభముహూర్తాలు ఉండడంతో ఈ రెండు నెలలపాటు పెద్దసంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నట్లు పురోహితులు వెల్లడిస్తున్నారు.

కల్యాణ మండపాలకు డిమాండ్!

ఫిబ్రవరి, మార్చిలో మంచి ముహూర్తాలు ఉండడంతో జిల్లాలోని కల్యాణమండపాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దాదాపు రెండు నెలల క్రితమే ఎక్కువ మంది ముందస్తుగా మండపాలను బుక్ చేసుకోవడంతో ఇప్పుడు ముహూర్తం నిర్ణయించుకున్నవారికి ఫంక్షన్ హాళ్లు దొరకడం లేదు. ఈ క్రమంలో కొందరు అందుబాటులోని ఆలయాల్లో వివాహ తంతు జరిపించేందుకు మొగ్గుచూపుతున్నారు. మరికొందరు తమ ఇళ్ల వద్దే ఖాళీ స్థలాల్లో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసుకుని పెళ్లి వేడుకలను నిర్వహించుకుంటున్నారు.

ఆడంబరాలే అధికం

ప్రస్తుతం వివాహ వేడుక స్టేటస్ హోదాను ప్రదర్శించే వేదికగా మారింది. ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా కొందరు లక్షలాది రూపాయలు వెచ్చిస్తుంటే.. మరికొందరు రూ.కోట్లు కుమ్మరిస్తున్నారు. ప్రతి ఒక్క అంశం గొప్పగా ఉండేలా చూసుకుంటున్నారు. అత్యాధునిక కెమెరాలతో పెళ్లితంతును చిత్రీకరించుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పసందైన వంటకాలతో పెద్దసంఖ్యలో వెరైటీలు ఉండేలా కేటరింగ్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. కొన్ని పెళ్లిళ్లలో అయితే వచ్చిన అతిథులకు సైతం విలువైన బహుమతులను అందజేస్తున్నారు.

శుభకరమైన మాసం



మాఘమాసం ఎంతో శుభకరమైంది. ముఖ్యంగా జనవరి నుంచి మార్చి వరకు గల ముహూర్తాలు వివాహానికి ఎంతో మంచివి. అందుకే పెద్దలు ఈ ముహూర్తాలలోనే పెళ్లి జరిపించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరో రెండు నెలలు ఈ సందడి కొనసాగుతుంది.

– సుధాకర్ గురుక్కల్, వేదపండితుడు



జోరుగా వ్యాపారం

వివాహాలు, శుభకార్యాల సీజన్ ప్రారంభం కావడంతో వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా దుస్తులు, బంగారా ఆభరణాలు, అలంకరణ వస్తువులు, శుభకార్యాల్లో వినియోగించే సామగ్రి, పూల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కేటరింగ్ వారికి మంచి డిమాండ్ ఏర్పడింది. నిత్యావసర సరుకులు విక్రయించే దుకాణాలు సైతం కిటకిటలాడుతున్నాయి.



వేలాదిమందికి ఉపాధి!

వివాహ వేడుకల కారణంగా వేలాదిమందికి ఉపాధి లభిస్తోంది. ప్రధానంగా పురోహితులు, డెకరేషన్ చేసేవాళ్లు, మంగళవాయిద్యాల కళాకారులు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, ఆర్కెస్ట్రావారు, కేటరింగ్, బ్యూటీ పార్లర్ నిర్వాహకులు, ట్రావెల్ ఏజెన్సీలకు చేతినిండా పని దొరుకుతోంది.



వైభవం.. త్రిశూల స్నానం



స్వర్ణముఖి నది వద్దకు పంచమూర్తుల ఊరేగింపులో ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు సిబ్బంది

శ్రీకాళహస్తి: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని స్వర్ణముఖినదిలో ఆదివారం సద్యోముక్తి వ్రతం, త్రిశూల స్నానం నేత్రపర్వంగా జరిగింది. తొలుత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ అలంకార మండపంలో పంచమూర్తులైన శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, వినాయకస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరస్వామి, త్రిశూలానికి పూజలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. తదుపరి పంచమూర్తులను ఊరేగింపుగా స్వర్ణముఖి నదిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్నాన ఘట్టం వద్దకు వేంచేపు చేశారు. సద్యోముక్తి వ్రత పూజల అనంతరం శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు. ఇదే సమయంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ధూప, దీప నైవేద్యాల అనంతరం పంచమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈసందర్భంగా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని మహాశివరాత్రికి ముందు స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఈవో సాగర్‌బాబు, ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, కుమారుడు అకర్ష్ రెడ్డి, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



త్రిశూలానికి అవభృథ స్నానం చేయిస్తున్న అర్చకులు



తిరుమలలో పున్నమి గరుడ సేవ ఆదివారం రాత్రి నయనానందకరంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్పస్వామివారు తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుడుడిని వాహనంగా చేసుకుని తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అశేష భక్తజనం గరుడ వాహన గోవిందా అంటూ స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. – తిరుమల

వేదోక్తం.. రామకృష్ణ తీర్థ ముక్కోటి



ముక్కోటిలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) శ్రీరామకృష్ణులకు పూజలు

తిరుమల: శేషాచల పర్వతశ్రేణుల్లోని పుణ్యతీర్థాల్లో ఒకటైన శ్రీరామకృష్ణ తీర్థంలో రామకృష్ణ ముక్కోటి ఆదివారం వేడుకగా జరిగింది. ఏటా మాఘ పౌర్ణమినాడు శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. శ్రీరామకృష్ణ మహర్షి తపోబలంతో ఈ పుణ్యతీర్థాన్ని సృష్టించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఉదయం 9గంటలకు శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది వేద మంత్రోచ్చారణల నడుమ పూజా సామగ్రి, ప్రసాదాలతో ఊరేగింపుగా బయలుదేరి రామకృష్ణ తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. రామకృష్ణ తీర్థానికి వెళ్లే భక్తులకు పాపవినాశనం డ్యామ్ వద్ద దేవస్థానం పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర పొట్లాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసింది. పాప వినాశనం వద్ద పార్కింగ్‌కు స్థలం పరిమితంగా ఉన్నందున గోగర్భం డ్యామ్ పాయింట్ దాటి ప్రైవేట్ ట్యాక్సీలు, జీపులను అనుమతించలేదు. స్థానికులతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి వచ్చిన వందలాది మంది యాత్రికులకు ట్రెక్కింగ్ సాఫీగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

నాకెందుకు శాపం..నేనేమి చేశాను పాపం!

'దేవుడా..! నాకెందుకు ఈ శాపం.. నేనేమి చేశాను పాపం.. నన్నుకూడా తీసుకెళ్లితే బావుండు.. నేను ఎవరికోసం బతకాలి.. నేనెందుకు ఉండాలి..' అంటూ ఆ ఇల్లాలు గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. కళ్లెదుటే విగతజీవులుగా పడి ఉన్న భర్త, ఇద్దరు పిల్లలను చూసి తల్లడిల్లిపోయింది. కళ్లల్లో నీళ్లు ఇంకిపోయేవరకు ఏడ్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు దూరమవ్వడాన్ని తట్టుకోలేకపోయింది. వారి తల నిమురుతూ.. పదేపదే ముద్దాడుతూ గుండెలు పగిలేలా రోదించింది. ఈ ఘటన రాపూరు మండలం, గుండవోలులో ఆదివారం విషాదాన్ని నింపింది.

- రోడ్డు ప్రమాదంలో భర్త, కుమార్తె మృతి
- చికిత్స పొందుతూ కుమారుడూ మృతి
- ఒకేసారి ముగ్గురికి అంత్యక్రియలు
- తల్లడిల్లిపోయిన ప్రభావతి
- శోకసముంద్రంలో గుండవోలు గ్రామం

రాపూరు: మండలంలోని వెలుగోను జంక్షన్ నుంచి ఏపూరు వెళ్లే జాతీయరహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తె అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో భర్త, ఇద్దరు పిల్లలను పోగొట్టుకున్న మహిళ కుప్పకూలిపోయింది. మోటారు బైక్‌పై గంగోటి ప్రతాప్ కుమార్తె వైష్ణవి, కుమారుడు సిద్ధార్థతో గుండవోలుకు బయల్దేరారు. ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు ఢీకొనడంతో ప్రతాప్, వైష్ణవి, అక్కడికక్కడే మృతి చెందగా. గాయపడిన సిద్ధార్థను వైద్యనిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సిద్ధార్థ (8) ఆదివారం మృతి చెందాడు.

కుప్పకూలిన ప్రభావతి

భర్త, పిల్లలు ఒకే సారి మృత్యువాత పడడంతో ప్రభావతి కుప్పకూలింది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. జేసీబీ డ్రైవర్ ప్రతాప్(38) ముంపు గ్రామానికి చెందినవాడు కావడం త్వరలో ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఉన్న కుటుంబానికి నిరాశే మిగిలింది. గ్రామంలో ఒకే కుటుంబంలోని ముగ్గురూ మృత్యువాత పడడంతో వృద్ధ తల్లిదండ్రులతోపాటు గ్రామం విషాదంలో మునిగింది.

ఒకే సారి ముగ్గురికి అంత్యక్రియలు

ప్రతాప్, వైష్ణవి, సిద్ధార్థ మృతదేహాలకు ఆదివారం ఒకే సారి అంత్యక్రియలు నిర్వహించారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.



సిద్ధార్థ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి ప్రభావతి



ప్రతాప్ (ఫైల్)



సిద్ధార్థ (ఫైల్)



వైష్ణవి (ఫైల్)

20 నుంచి బ్రహ్మోత్సవాలు

తిరుపతి అలిపిరి: తొండమనాడులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 19న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 20న ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించింది. తొలి రోజు రాత్రి శేష వాహనం స్వామివారి ఊరేగింపు ఉంటుందని పేర్కొంది.

క్లుప్తంగా

లారీని ఢీకొన్న బైక్

- ఇద్దరు మృతి, మరొకరి పరిస్థితి విషమం



సంఘటనా స్థలంలో పడి ఉన్న యువకులు

పెళ్లకూరు: ముందువెళుతున్న లారీని ఢీ కొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ముగ్గురు యువకులు మోటారుబైక్‌లో నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై బయల్దేరారు. మార్గమధ్యలో టెంకాయతోపు గ్రామం వద్ద ముందు వెళుతున్న లారీని అతి వేగంగా ఢీకొన్నారు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు 108 వాహనంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల ప్రకారం మృతులు ప్రొద్దుటూరుకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, పుత్తూరుకు చెందిన ధర్మయ్య అని చెప్పారు. క్షతగాత్రుడి పేరు అజయ్ అని మాత్రమే తెలిసింది. మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది. రోడ్డు అభివృద్ధి పనులు ఒకవైపు, ప్రమాదం మరో వైపు చోటుచేసుకోవడంతో ఇరువైపులా వాహనాలు మూడు కిలోమీటర్ల దూరం నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఇన్‌చార్జ్ ఎస్‌ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు.

నేడే ఎస్‌పీఎల్ ఆఖరు పోరు

- సెమీస్, ఫైనల్స్ మ్యాచ్‌లు
- జూనియర్స్‌లో ఫైనల్స్‌కు సీకాం, ఎమరాల్డ్స్ జట్లు
- సీనియర్స్‌లో ఫైనల్స్‌కు అర్హత సాధించిన శ్రీవిద్యానికేతన్ జట్టు



సాక్షి ప్రీమియర్ లీగ్‌లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపం తుమ్మలగుంటలోని క్రికెట్ మైదానాల్లో ఐసీసీ నిబంధనలకు అనుగుణంగా 6వ రోజు ఆదివారం ఐపీఎల్ తరహాలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. జూనియర్స్ లీగ్, నాకౌట్‌లలో ప్రతిభ కనబరచిన తిరుపతి సీకాం, ఎమరాల్డ్స్ జట్లు సెమీస్‌లో ప్రత్యర్థి జట్లుపై విజయం సాధించి ఆఖరు పోరుకు అర్హత సాధించాయి. సీనియర్స్ విభాగంలో శ్రీవిద్యానికేతన్ జట్టు ఫైనల్స్‌కు అర్హత సాధించింది. సోమవారం సీనియర్స్ విభాగంలో తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల జట్ల మధ్య రెండో సెమీఫైనల్స్ జరగనుంది. ఇందులో గెలుపొందే జట్టు శ్రీవిద్యానికేతన్ జట్టుతో ఫైనల్ మ్యాచ్‌లో తలపడనుంది.

• గ్రౌండ్ 1లో...

సీనియర్స్ విభాగంలో రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ శ్రీవిద్యానికేతన్, మదనపల్లె విశ్వం జట్ల మధ్య జరిగింది. శ్రీవిద్యానికేతన్ జట్టు 8వికెట్ల తేడాతో గెలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విశ్వం జట్టు పది ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 72పరుగులు చేసింది. శ్రీవిద్యానికేతన్ జట్టు 7.1ఓవర్లలో 2వికెట్లు నష్టపోయి 76పరుగులు చేసి సెమీస్‌కు అడుగు పెట్టింది.

SAKSHI MEDIA GROUP

జూనియర్స్ విభాగంలో..

తిరుపతి సీకాం, వేము పాలిటెక్నిక్ జట్ల మధ్య తొలి సెమీ ఫైనల్స్ జరిగింది. వేము జట్టుపై సీకాం 9వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వేము జట్టు 10ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 43పరుగులు చేయగా, సీకాం జట్టు 5.1ఓవర్లలోనే ఒక వికెట్ నష్టానికి 44 పరుగులు చేసి గెలుపొందింది.

రెండో సెమీస్‌లో..

జూనియర్స్ విభాగంలో ఎస్వీ ఐటీఐ, ఎమరాల్డ్స్ జట్ల మధ్య జరిగిన రెండో సెమీస్‌లో,ఎమరాల్డ్స్ విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీ ఐటీఐ జట్టు 10ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 87పరుగులు చేయగా, ఎమరాల్డ్స్ జట్టు వికెట్ నష్టపోకుండా 6.1ఓవర్లలోనే 89పరుగులు చేసి అద్భుత విజయంతో ఫైనల్‌కు అడుగుపెట్టింది. ఈ మ్యాచ్‌లో ఎమరాల్డ్స్ జట్టు బ్యాట్స్‌మెన్ దిలీప్ 23బంతుల్లో 8ఫోర్లు, 4సిక్సర్లతో అజేయంగా 61పరుగులు చేసి జట్టును విజయతీరంలోకి చేర్చాడు.

SAKSHI PREMIER LEAGUE

• గ్రౌండ్ 2లో...

సీనియర్స్ విభాగంలో తిరుపతి సీకాం డిగ్రీ, పుత్తూరు సిద్ధార్థ జట్ల మధ్య మూడవ క్వార్టర్ ఫైనల్స్ జరిగింది. సీకాం జట్టు 31పరుగుల తేడాతో గెలుపొంది సెమీస్‌కు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 10ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 88పరుగులు చేయగా, సిద్ధార్థ జట్టు 10ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 57పరుగులు మాత్రమే చేసింది.

నాల్గవ క్వార్టర్ ఫైనల్స్‌లో..

సీనియర్స్ విభాగంలో ఎస్‌డీహెచ్‌ఆర్, ఎస్‌జీఎస్ జట్ల మధ్య నాల్గవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఎస్‌జీఎస్ జట్టు 8వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌డీహెచ్‌ఆర్ జట్టు 10ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 80పరుగులు చేసింది. ఎస్‌జీఎస్ జట్టు 9ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 81పరుగులు చేసి సెమీస్‌కు అర్హత సాధించింది.

తొలి సెమీఫైనల్స్‌లో..

సీనియర్స్ విభాగంలో శ్రీవిద్యానికేతన్, ఎస్వీఈసీ–1 జట్ల మధ్య తొలి సెమీ ఫైనల్స్ జరిగింది. శ్రీవిద్యానికేతన్ జట్టు 9వికెట్ల తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీఈసీ–1జట్టు 10ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 55పరుగులు మాత్రమే చేసింది. శ్రీవిద్యానికేతన్ జట్టు 7.1ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 57పరుగులు చేసింది.

విజేత జట్లు

గ్రౌండ్ –1
- శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు (సీనియర్స్)
- తిరుపతి సీకాం జూనియర్ కళాశాల జట్టు (జూనియర్స్)
- తిరుపతి ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు (జూనియర్స్)

గ్రౌండ్ – 2
- తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు (సీనియర్స్)
- ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల జట్టు(సీనియర్స్)
- శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు (సీనియర్స్)



శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు (సీనియర్స్)



తిరుపతి సీకాం జూనియర్ కళాశాల జట్టు (జూనియర్స్)



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల జట్టు (సీనియర్స్)



ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు (జూనియర్స్)

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



మృతి చెందిన పెంచలయ్య

రాపూరు: రాపూరు మండలంలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఆయన కథనం.. డక్కిలి మండలం దేవలపల్లెకు చెందిన కుదిగంట పెంచలయ్య(52) రాపూరు మండలం గిలకపాడు ఏని వద్ద ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మృతి చెందాడు. ఇతను మండలంలోని పోకురుపల్లె వద్ద నిమ్మతోటకు వెళ్లేందుకు మద్దెలమడుగు వద్ద బండేపల్లికి చెందిన నవీన్ ఆటోలో వెళుతున్న కూలీలతోపాటు ఎక్కాడు. గిలకపాడు సమీపంలోని ఏని వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో నరసయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆటోలోని కూలీలు స్వల్పంగా గాయపడ్డారు. ఆత్మకూరు సమీపంలోని నెల్లూరుపాళెంకు చెందిన మురళి (40) ట్రక్కు ఆటోలో బీరువాను శ్రీకాళహస్తికి తీసుకెళుతుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. సిద్దవరం వద్ద కళ్లు తిరగడంతో ఆటోలోనుంచి కింద పడిపోవడంతో మృతి చెందాడు. ఈ మేరకు రెండు కేసులను దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆస్టర్లో ప్రపంచస్థాయి వైద్య సేవలు





ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆస్పత్రి యాజమాన్యం

- ఆస్పత్రిని ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా
- పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రముఖులు

తిరుపతి తుడా: ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఏర్పాటుతో ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా పేర్కొన్నారు. రేణిగుంటరోడ్డులోని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిని ఆదివారం ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ వ్యవస్థాపక చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆజాద్ మూపెన్, డాక్టర్ సునందకుమార్ రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, మేడా మల్లికార్జున్ రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, తిరుపతి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ భారతదేశంతో సహా ఏడు దేశాలలో వైద్య సేవలను విస్తరింపజేసి, అత్యాధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ సంస్థ తిరుపతిలో ఏర్పాటు కావడం హర్షణీయమన్నారు. వైద్య రంగంలో ఆస్టర్ ఆస్పత్రుల వైద్య సేవలు ప్రత్యేకమైనవని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ వ్యవస్థాపక చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆజాద్ మూపెన్ మాట్లాడుతూ జీసీసీ, దేశంలోని ప్రముఖ ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్‌లలో ఒకటైన ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ తిరుపతిలో హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సాధారణ ప్రజలకు అందుబాటులోని వైద్య చార్జీలతోపాటు ప్రత్యేక ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేశామని తెలిపారు. న్యూరోసైన్సెస్, మల్టీ–ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఆంకాలజీ, గ్యాస్ట్రో సైన్సెస్, కార్డియాక్ సైన్సెస్ వంటి సూపర్ స్పెషాలిటీలతో పాటు రుమటాలజీ, ఎండోక్రినాలజీ, మహిళలు, పిల్ల లు తదితర విభాగాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్‌ను 24 గంటలూ అందిస్తామని తెలిపారు. డాక్టర్ సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య సేవలను ఆరోగ్యశ్రీ ద్వారా పేద లకు అందించేందుకు ఆస్టర్ యాజమాన్యం ముందుకు వచ్చిందన్నారు. డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ గోపీకృష్ణారెడ్డి, డాక్టర్ మధు కృష్ణారెడ్డి, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ నాగరాజు, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి ఇంటికి ప్రభుత్వ సలహాదారు సజ్జల

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా తుమ్మలగుంటలోని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంటికి విచ్చేశారు. ఆయనకు తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, చిగురువాడ సర్పంచ్ ముప్పేలి ప్రదీప్ రెడ్డి, పుదిపట్లకు చెందిన వైఎస్సార్ సీపీ నేత మల్లారపు శ్రీరాములు శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. అంతకుముందు వారిని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డికి పరిచయం చేశారు.



తుమ్మలగుంటలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన మునస్వామిరెడ్డి

శ్రీరంగరాజపురం: వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన మండల పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా, పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన మునస్వామిరెడ్డి(65) గడ్డి కోసేందుకు పొలానికి వెళ్లాడు. అయితే ఎంతవరకూ ఇంటికి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా మునస్వామిరెడ్డికి హత్యకు గురైనట్లు గుర్తించారు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ షేక్షావలి సిబ్బందితో సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుని మెడ, చెవి, మో చేతికి తీవ్రమైన గాయాలైనట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేశారు. చిత్తూరు డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

తిరుపతి క్రైం: పోలీస్ శాఖ క్రమశిక్షణతో కూడిన వ్యవస్థ అని, విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అనంతపురం రేంజ్ డీఐజీ రవి ప్రకాష్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి ఆదివారం సాయుధ దళంలో తనిఖీలు నిర్వహించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏఆర్ పోలీసుల, హోంగార్డ్, బ్యాండ్ పార్టీ ప్రదర్శనలు జరిగాయి. డీఐజీ మాట్లాడుతూ తిరుపతి మహా పుణ్యక్షేత్రంలో పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు. సాయుధ దళం, బీడీ టీమ్ ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆయుధాల స్టాళ్లను ఆయన సందర్శించారు. స్పెషల్ పార్టీ ప్రదర్శించిన మాబ్ ఆపరేషన్ డ్రిల్, హోస్టేజ్ రిలీజ్ ఆపరేషన్ డ్రిల్‌ను పరిశీలించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం సాయుధ కార్యాలయంలో రికార్డులు, వాహనాలను తనిఖీ చేసి సూచనలు అందించారు. ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, సెబ్ డైరెక్టర్ రాజేంద్ర, డీఎస్పీలు నందకిషోర్, లక్ష్మణ్ కుమార్, ఆర్‌ఐలు రెడ్డప్ప రెడ్డి, చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధాలను పరిశీలిస్తున్న డీఐజీ రవి ప్రకాష్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

ప్రియురాలి ఇంటి ఎదుటే
ప్రియుడి ఆత్మహత్యాయత్నం

ఓజిలి: ప్రియురాలి ఇంటి ఎదుటే ప్రియుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన మండలంలోని కురుగొండ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల మేరకు, కోట మండలం చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన శివతేజ(20) ఎన్‌బీకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాలలో చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో కురుగొండకు చెందిన యువతి డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరిద్దరికీ రెండేళ్ల క్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ కలిసి తిరుగుతుండడంతో, ఇరువురి ఇళ్లలో తెలిసింది. ఇటీవల కోట పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ పెట్టారు. అయినా వీరి మధ్య ఫోన్ ద్వారా సంభాషణలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో యువతికి శనివారం కురుగొండ గ్రామంలో పెళ్లి చూపులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న శివతేజ ఆదివారం యువతి ఇంటికి వచ్చాడు. యువతి బంధువులు, శివతేజకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. అనంతరం వెంటనే వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని గ్యాస్ లైటర్‌ను వెలిగించాడు. మంటలు వ్యాపించి, అంటుకుని ఒళ్లంతా కాలిపోయింది.



చికిత్స పొందుతున్న శివతేజ

స్థానికులు మంటలను అదుపుచేసి 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ దారం ఆదిలక్ష్మి ఆస్పత్రికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాహాల్లో పనిచేస్తూ జీవనం...

శివతేజ కాలేజీలో చదువుకుంటూ కోటలోని అరుణా థియేటర్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తూ తల్లిని పోషిస్తున్నాడు. ఎన్‌సీసీలో చేరి రెండు రోజులు క్రితం నెల్లూరులో పరీక్ష రాశాడని శివతేజ తల్లి సంధ్య తెలిపింది. ఆరు నెలల క్రితం చెల్లెలికి వివాహం చేశాడు. ఈ క్రమంలో ప్రియురాలి నుంచి ఫోన్ రావడంతో ఎన్‌సీసీ పరీక్షకు వెళుతున్నానంటూ కురుగొండకు వచ్చినట్లు సంధ్య తెలిపింది. మేజిస్ట్రేట్ ఎదుట పోలీసులు శివతేజ వాంగ్మూలాన్ని నమోదు చేశారు.